సాక్షి ప్రకాశం
బుధవారం । 22 । మే । 2024



హరహరా.. చెన్నకేశవా
జిల్లాలో ప్రసిద్ధిగాంచిన చిన్నగొల్లపల్లి లక్ష్మీచెన్నకేశవ స్వామి తిరునాళ్ల అంగరంగ వైభవంగా సాగుతోంది. తిరునాళ్లలో గరుడ సేవ నిర్వహించారు. - 8లో..



ఐస్ యాపిల్
వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగించేలా తాటిముంజల విక్రయాలు జిల్లాలో జోరుగా సాగుతున్నాయి. డజన్ రూ.50 నుంచి రూ.80 వరకు విక్రయిస్తున్నారు. - 8లో..

వాతావరణం
గరిష్టం/కనిష్టం
37.2/29.6
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

విద్యా, వసతి దీవెన అర్హుల జాబితాలు తయారు చేయండి

● సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మానాయక్


మాట్లాడుతున్న లక్ష్మానాయక్

మార్కాపురం: విద్యా దీవెన, వసతి దీవెనలకు సంబంధించి జాయింట్ ఖాతాలను ఇప్పటి వరకూ అప్‌డేట్ కాని విద్యార్థినీ విద్యార్థుల ఖాతాలను అప్‌డేట్ చేసి అర్హుల జాబితా తయారు చేయాలని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మానాయక్ ఆదేశించారు. పట్టణంలోని వేమన డిగ్రీ కళాశాలలో మంగళవారం ఆయన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏఎస్‌డబ్ల్యూ అరుణకుమారి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో లక్ష్మానాయక్ మాట్లాడుతూ గడచిన త్రైమాసికం వరకూ విడుదలైన నిధులను కళాశాలలకు చెల్లించని తల్లులకు ఫీజు కళాశాలలకు చెల్లించేలా విద్యార్థుల తల్లులకు కౌన్సిలింగ్ నిర్వహించాలని తెలిపారు. అనంతరం నవశకం లాగిన్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి 5 స్టెప్పుల వెరిఫికేషన్ పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి కారణాలను నవశకం లాగిన్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. ఎన్‌పీసీఐ పెండింగ్ ఉన్న ఎస్సీ విద్యార్థుల ఆధార్ నంబరును బ్యాంకు ఖాతాకు అనుసంధానం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూలు ఎన్ అమ్మాజీ, రాజేశ్వరి పాల్గొన్నారు.

బధిరుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

చీమకుర్తి: చీమకుర్తిలోని ఎస్‌కేఆర్ బధిరుల పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి ప్రవేశం కోసం అర్హత కలిగిన దివ్యాంగుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ ఎస్ అంజిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 10వ తరగతి వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. పుట్టుకతో మూగ, చెవుడు వంటి లోపాలతో ఉన్న విద్యార్థులకు ప్రత్యేక సాంకేతిక పరికరాలతో విద్యనందిస్తున్నట్లు చెప్పారు. వాటితో పాటు ఫొటో లామినేషన్, కవర్‌లు, కొవ్వొత్తులు, ఫినాయిల్ తయారీలో శిక్షణ, బైండింగ్ వంటి పనుల్లో శిక్షణ కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. దివ్యాంగులను చేర్పించేందుకు వారి తల్లిదండ్రులు జూన్ నెల 12వ తేదీ లోపు తమ దరఖాస్తులను చీమకుర్తిలోని ఎస్‌కేఆర్ బధిరుల పాఠశాలలో అందించాలని, పూర్తి వివరాలకు 9440336730 ఫోన్ ద్వారా సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

సప్లిమెంటరీ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలి

ఒంగోలు: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల హాల్ టికెట్లను పాఠశాల ప్రధానోపాధ్యాయులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని డీఈవో డి.సుభద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల సమాచారం కావాలంటే సెల్ నంబర్లు 7842777439 లేదా 7842777429 లను సంప్రదించాలన్నారు.

పట్టణ ఆరోగ్యరేఖ

పట్టణాల్లో పేద, మధ్య తరగతి ప్రజలు వైద్యానికి పడుతున్న అగచాట్లను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గుర్తించింది. వీరికి మెరుగైన వైద్యాన్ని చేరువ చేసేందుకు డా. వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్‌లపై ఫోకస్ పెట్టింది. చిన్న, చిన్న ఆరోగ్య సమస్యలకు పెద్దాసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా చేసింది. పక్కా భవనాలు, నిపుణులైన వైద్యులు, వైద్య సిబ్బంది, అధునాతన వైద్య పరికరాలను అందుబాటులోకి తెచ్చింది. ఇవి పేదల ఆరోగ్యానికి భరోసానిస్తున్నాయి.

- పేదల ముంగిట సర్కార్ వైద్యం
- జిల్లాలో 19 డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్‌లు
- ఒంగోలు నగరం చుట్టూ 9 ఆరోగ్య కేంద్రాలు
- డాక్టర్‌తో సహా ఏడుగురు సిబ్బందితో నిరంతర వైద్య సేవలు
- నిరుపేదలకు అందుబాటులో ఖరీదైన వైద్య సేవలు
- ఉచితంగా 60 రకాల రోగ నిర్ధారణ పరీక్షలు, ఔషధాలు



మార్కాపురంలోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్

ఒంగోలు టౌన్: చంద్రబాబు హయాంలో ప్రభుత్వ వైద్యశాలల్లో వైద్యులు ఉండేవారు కాదు. ఒకవేళ వైద్యులు ఉంటే మందులు అందుబాటులో ఉండేవి కావు. మందులు ఉంటే రోగ నిర్ధారణ పరీక్షలు చేయడానికి పరికరాలు సైతం ఉండేవి కావు. అందుకే ప్రభుత్వ వైద్యశాలల్లో చికిత్స చేయించుకునేందుకు రోగులు భయపడేవారు. సకాలంలో వైద్య చికిత్స అందక ఎంతో మంది నిరుపేదల ప్రాణాలు గాలిలో కలిసిపోయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇదంతా గతం. ఇప్పుడు పరిస్థితి మారింది. 2019 లో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక పేదల ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యత పెరిగింది. డా. వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్‌లతో పట్టణ ప్రాంతాల్లోని నిరుపేదకు మెరుగైన వైద్యం అందుబాటులోకి వచ్చింది. వైద్యులు, రోగ నిర్ధారణ పరీక్షలు, మందులు అన్నీ అందుబాటులో ఉంచడంతో పేదలకు ఆరోగ్య భరోసా చిక్కింది. ఎవరికి ఎలాంటి అనారోగ్యం కలిగినా అప్పటికప్పుడు వైద్య సేవలు ఇంటికి సమీపంలో ఉన్న అర్బన్ వైద్యశాలలకు వెళ్తున్నారు. అవసరమైన పరీక్షలు చేయించుకొని చికిత్స తీసుకుంటున్నారు.

జిల్లాలో 19 అర్బన్ వైద్యశాలలు:

జిల్లాలో 19 అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా జిల్లా కేంద్రమైన ఒంగోలులోని శివారు ప్రాంతాల్లో 9 ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఇవన్నీ శివారు ప్రాంతాల ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ ఒక క్వాలిఫైడ్ డాక్టర్, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఒక ఫార్మాసిస్ట్, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్, ఒక నాల్గోవ తరగతి ఉద్యోగి అందుబాటులో ఉంటున్నారు. మొత్తం ఏడుగురు సిబ్బందితో నిత్యం వైద్య సేవలు అందుతున్నాయి. నగరంలోని వెంకటేశ్వర కాలనీ, పాపా కాలనీ, రాజీవ్ గృహకల్ప, వెంగముక్కల పాలెం, బాలాజీ నగర్, ముంగమూరు డొంక, పీర్లమాన్యం, గద్దలగుంట, గుడిమెళ్లపాడులో అర్బన్ వైద్యశాలల్లో అన్నీ రకాల సౌకర్యాలు అందుబాటులో ఉంచారు. జిల్లాలో చీమకుర్తి, దర్శి, పొదిలి, మార్కాపురంలో మూడు, గిద్దలూరులో రెండు, కనిగిరిలో రెండు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి.

ప్రతి రోజు 40 ఓపీలు

నగరంలోని అర్బన్ వైద్యశాలల్లో ప్రతి రోజు 30 నుంచి 40 మంది దాకా వివిధ ఆరోగ్య సమస్యలతో చికిత్స కోసం వస్తున్నారు. మోకాళ్ల నొప్పులు, విరేచనాలు, జ్వరంతో బాధపడే వారు ఎక్కువగా చికిత్సలు పొందుతున్నారు. ప్రతి ఒక్కరికీ వైద్యులు పరీక్షలు చేసి అవసరమైనా ఔషధాలు అందజేస్తున్నారు. ఇక్కడ బీపీ, షుగర్, విరేచనాలు, మోకాళ్ల నొప్పులతో పాటుగా మొత్తం 172 రకాల మందులను అందుబాటులో ఉంచారు. ఒక్కో అర్బన్ వైద్యశాల పరిధిలో 7 సచివాలయాలు ఉన్నాయి. ప్రతి రెండు వేల మందికి ఒకరు చొప్పున 11 మంది ఆశా కార్యకర్తలను ప్రభుత్వం నియమించింది. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంల సహకారంతో ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది.

పీర్లమాన్యం యూపీహెచ్‌సీలో స్కానింగ్ సౌకర్యం

మహిళల వైద్య చికిత్సలో అల్ట్రా సౌండ్ స్కానింగ్ చాలా అవసరం. ఇది లేకుండా ఎలాంటి చికిత్స చేయాలో తెలియని పరిస్థితి ఉంది. అందుకే ప్రతి గైనకాలజిస్ట్ తప్పనిసరిగా తమ ఆస్పత్రిలో స్కానింగ్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ పరీక్షకు స్కానింగ్ సెంటర్లలో 1000 రూపాయల ఫీజు వసూలు చేస్తున్నారు. ఇది నిరుపేద రోగులకు తలకు మించిన భారంగా తయారైంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద రోగుల కోసం నగరంలోని పీర్లమాన్యం అర్బన్ వైద్యశాలలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసింది. మహిళల ఆరోగ్యానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు ఇది ప్రత్యక్ష నిదర్శనం అని చెప్పొచ్చు.

ఉచితంగా రోగ నిర్ధారణ పరీక్షలు

చికిత్స కోసం ప్రైవేటు వైద్యశాలలకు వెళితే చికిత్స కంటే రోగ నిర్ధారణ పరీక్షల ఖర్చు ఎక్కువవుతుంది. వేలకు వేలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి. కమీషన్లకు కక్కుర్తిపడి కొందరు ప్రైవేటు వైద్యులు అవసరం ఉన్నా లేక పోయినా ఖరీదైన రక్త పరీక్షలు రాస్తున్నారన్న ఆరోపణలున్నాయి. దీంతో ప్రజలు రోగ నిర్ధారణ పరీక్షలు అంటేనే జడుసుకుంటున్నారు. ఈ క్రమంలోనే పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా 60 రకాల రక్త పరీక్షలను చేసేందుకు ప్రభుత్వం ఆధునిక సౌకర్యాలను సమకూర్చింది. సీబీపీ, బ్లడ్ షుగర్, హెచ్‌బీ, ఈఎస్ఆర్, క్లాటింగ్ టైం, బ్లీడింగ్ టైం పరీక్షలు చేస్తారు. ఖరీదైన హెచ్ఐవీ, హెపటైటిస్ బీ, వీడీఆర్ఎల్ పరీక్షలతో పాటుగా జ్వరంతో బాధపడే వారికి డెంగీ, చికున్‌గున్యా, మలేరియా, టైఫాయిడ్ పరీక్షలను ఉచితంగా చేస్తున్నారు. ప్లేట్‌లెట్ కౌంటింగ్ కూడా చేస్తారు. ఇంకా గుండె జబ్బుల నిర్ధారణకు చేసే ఈసీజీ, లిపిడ్ ప్రొఫైల్ పరీక్షలు, కిడ్నీ వ్యాధులను నిర్ధారించే సీరం క్రియాటిన్, బ్లడ్ యూరియా, సీరం ఎలక్ట్రోలైట్స్, మద్యం ఎక్కువగా సేవించే వారిలో వచ్చే పాంక్రియాటైటిస్ వ్యాధిని నిర్ధారించే సీరం ఎములైజ్, సీరం లైపేజ్ పరీక్షలు, టీబీ నిర్ధారణకు గాను కళ్లె పరీక్షలు చేస్తున్నారు. కంప్లీట్ యూరిన్ అనాలసిస్ పరీక్షలు చేసి మూత్రంలో ఆల్బుమిన్, ప్రొటీన్స్ పోతుంటే పసిగడుతున్నారు. లివర్ వ్యాధులకు సంబంధించిన ఎల్ఎఫ్టీ పరీక్ష ఇలా వేలాది రూపాయలు ఖర్చయ్యే పరీక్షలన్నీ పూర్తి ఉచితంగా చేస్తున్నారు.

చికిత్స కోసం ఆర్ఎంపీల వద్దకు వెళ్లవద్దు



రాష్ట్ర ప్రభుత్వం పట్టణ ప్రాంత నిరుపేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు అందించేందుకు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసింది. ప్రజలు చిన్న రుగ్మతలకు చికిత్స కోసం ఆర్ఎంపీల వద్దకు వెళ్లి ఆరోగ్యం దెబ్బ తీసుకోకుండా ప్రభుత్వ వైద్యశాలల్లో అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి. అలాగే చిన్న సమస్యలకు కార్పొరేట్, ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లి డబ్బులు వృథాగా ఖర్చు చేసుకోవద్దు. పట్టణ ప్రాంతాల్లోని ఆరోగ్య కేంద్రాల్లో అన్నీ రకాల సౌకర్యాలు ఉన్నాయి. ఆధునిక వైద్య పరికరాలు అందుబాటు ఉన్నాయి.

– డా.సురేష్ కుమార్, డీఎంహెచ్‌ఓ

ప్రతి రోజూ 40 వరకు ఓపీ ఉంటుంది



బాలాజీ నగర్‌లో ఉన్న వైద్యశాలకు ప్రతి రోజు కనీసం 35 నుంచి 40 మంది వరకు చికిత్స కోసం వస్తున్నారు. ముఖ్యంగా జ్వరాలు, మోకాళ్ల నొప్పులు, విరేచనాలతో వచ్చేవారు ఎక్కువగా ఉంటున్నారు. విరేచనాలతో బాధ పడేవారికి సెలైన్ ఎక్కించి అవసరమైన చికిత్స అందిస్తున్నాం. కుక్కకాటుతో వచ్చేవారికి వ్యాక్సిన్లు వేస్తారు. ప్రాథమిక చికిత్స తరువాత ఎవరికైనా మెరుగైన చికిత్స అవసరమైతే వారిని వెంటనే సర్వజన ఆస్పత్రికి పంపుతారు. అలాగే అవసరమైన వారికి రోగ నిర్ధారణ పరీక్షలు చేసేందుకు అర్బన్ వైద్యశాలలో ఆధునిక పరికరాలతో కూడిన వసతులు ఉన్నాయి.

– డాక్టర్ సంతోష్ కుమార్, యూపీహెచ్ఎస్, బాలాజీ నగర్, ఒంగోలు.


కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: సాధారణ ఎన్నికలకు సంబంధించి జూన్ 4వ తేదీ జరిగే ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి అవసరమైన కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లు త్వరితగతిన పక్కాగా చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూములను, తలుపుల సీళ్లను పరిశీలించారు. అనంతరం అక్కడే ఓట్ల లెక్కింపు కార్యక్రమం నిర్వహిస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఓట్ల లెక్కింపు గదుల వద్ద సిబ్బందికి, రాజకీయ పార్టీల ఏజెంట్లకు వేర్వేరుగా బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఓట్ల లెక్కింపులో పాల్గొనే సిబ్బందికి శిక్షణ కార్యక్రమం కూడా గురువారం నిర్వహిస్తున్న నేపథ్యంలో తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. కలెక్టర్‌తో పాటు ఒంగోలు లోక్‌సభ నియోజకవర్గ ఏఆర్‌ఓ ఝాన్సీ, డీఆర్‌ఓ శ్రీలత, గిద్దలూరు ఆర్‌ఓ నాగజ్యోతి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలున్న పిల్లలను గుర్తించాలి

● డీఈవో డి.సుభద్ర

ఒంగోలు: భవిత కేంద్రాల్లో పనిచేస్తున్న సహిత విద్య రిసోర్సు పర్సన్లు ప్రత్యేక అవసరాలున్న పిల్లలను గుర్తించాలని జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర మంగళవారం ఒక ప్రకటనలో ఆదేశించారు. రాష్ట్ర సమగ్రశిక్ష సహిత విద్య విభాగం నుంచి అందిన ఆదేశాల మేరకు 21 రకాలైన ప్రత్యేక అవసరాలున్న పిల్లలను గుర్తించాలని, వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని చెప్పారు. మండల స్థాయిలో గ్రామాలన్నింటినీ రెండు క్లస్టర్లుగా విభజించి మండల పరిధిలోని సహిత విద్య రిసోర్సు పర్సన్లకే కేటాయించాలని, సదరు క్లస్టర్లకు కేటాయించిన రిసోర్స్ పర్సన్లు ప్రతి రోజు సర్వే నిర్వహించాలని, వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. దీనిని ఎంఈవోలు తప్పనిసరిగా పర్యవేక్షించాలన్నారు. 40 రోజులపాటు జరిగే ఈ సర్వే వివరాలు ఎప్పటికప్పుడు జిల్లా కార్యాలయానికి తెలియజేయాలని సూచించారు. నమోదు డ్రైవ్ పూర్తయిన తరువాత వివరాలన్నింటినీ నిర్ణీత ప్రొఫార్మాలో మండల విద్యాశాఖ అధికారి సంతకంతో జిల్లా సమగ్రశిక్ష కార్యాలయానికి పంపాలని, సర్వే అనంతరం వారి మండలంలో సర్వే పూర్తయిందనే ధ్రువీకరణ పత్రం జతపరచాలన్నారు. ఈ నమోదు వల్ల ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు ట్రాన్స్‌పోర్టు అలవెన్స్, ఎస్కార్ట్, రీడర్, బాలికల స్టైఫండ్, ఉపకరణాలు, బోధనాభ్యాస సామగ్రి, ఫిజియోథెరపీ సేవలు, ప్రత్యేక విద్య ఉచితంగా అందిస్తారన్నారు. సదరం సర్టిఫికెట్లకు నమోదు, ఆరోగ్యబీమా, నిర్ధారణ శిబిరాలకు తీసుకురావడంలో భవిత కేంద్రాల్లో పనిచేస్తున్న రిసోర్సు పర్సన్ల సహాయం, పాఠశాలకు రాలేని విద్యార్థులకు ఇంటివద్ద విద్యను ప్రతి శనివారం బోధించడం వంటివి ఉంటాయన్నారు. ప్రతి పాఠశాల ప్రధానోపాధ్యాయులు వారి పాఠశాలల్లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థుల ప్రత్యేక అవసరాల వివరాలను యూడైస్‌లో నమోదుచేయాలని, తద్వారా వారికి రాయితీలు, ప్రయోజనాలు అందిస్తారని చెప్పారు. జూన్ 10వ తేదీలోగా మండల స్థాయి ప్రత్యేక అవసరాల విద్యార్థుల గుర్తింపు, నమోదు సర్వే అనంతరం సంబంధిత ప్రొఫార్మాలను జిల్లా కార్యాలయానికి పంపాలన్నారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు 230 మంది ప్రత్యేక అవసరాలున్న పిల్లలను సహిత విద్యా రిసోర్సు పర్సన్లు గుర్తించారని, ఇంకా ఎవరైనా మిగిలి ఉన్నవారిని గుర్తించేందుకు సచివాలయాలు, అంగన్‌వాడీల ద్వారా ముందస్తు సమాచారాన్ని సేకరించుకోవాలని, ఇంటింటి సర్వే చేపట్టాలన్నారు.

గెలుపోటముల్లో సోదర భావం ఉండాలి


ధర్నా చేస్తున్న ఆందోళనకారుల వేషధారణలో పోలీసులు


ఆందోళనకారులపై పోలీసుల లాఠీచార్జ్


ఆందోళన కారుల పై వాటర్ ప్రెజర్

- రిజల్ట్ తర్వాత గొడవలు వద్దు
- ప్రజల్లో చైతన్యం రావాలి
- ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్



తాలూకా క్లబ్ సమావేశం హాలులో మాట్లాడుతున్న ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్

దర్శి: గెలుపు ఓటములు సోదర భావంతో సమానంగా స్వీకరించాలని ఎస్పీ గరుడ్‌సుమిత్ సునీల్ సూచించారు. స్థానిక తాలూకా క్లబ్ సమావేశం హాలులో రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం గడియార స్తంభం సెంటర్‌లో గొడవలు జరిగితే పర్యవసానం తీవ్రంగా ఉంటుందని తెలియజేస్తూ పోలీసులు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. పోలీసులే ఆందోళనకారులుగా ప్లకార్డులు తీసుకుని ధర్నాకు కూర్చుంటారు. పోలీసులు హెచ్చరించినా ఆందోళనకారులు మరింత రెచ్చిపోయి రాళ్లు రువ్వుతారు. ఆ తరువాత పెట్రోల్ బాంబులు వేసి పోలీసుల దిష్టి బొమ్మను దహనం చేస్తారు. దీంతో పోలీసులు లాఠీచార్జ్ చేస్తారు. అయినా ఆందోళనకారులు అక్కడి నుంచి కదలరు. మరింత రెచ్చిపోయి వ్యతిరేక నినాదాలు చేస్తారు. ఆ తరువాత ఫైర్ ఇంజన్ ద్వారా వాటర్ ప్రెజర్ చేసి వారిని చెదరగొట్టేందుకు ప్రయత్నిస్తారు. అయినా అలాగే కదలకుండా ఉండిపోతారు. గాల్లోకి కాల్పులు చేసినా ఆందోళన విరమించరు. దీంతో ఆఖరిగా పోలీసులు కాల్పులు జరుపుతారు. కాల్పుల్లో బుల్లెట్‌లు తగిలి కిందపడిపోతారు. దీంతో అంబులెన్స్ తీసుకువచ్చి వారిని వెంటనే ఆస్పత్రికి తరలిస్తారు. ఈ ఘటన మొత్తం నిజంగా జరిగినట్లే పోలీసులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్రంలో ఓటింగ్‌లో దర్శి నియోజకవర్గం నంబర్ వన్ స్థానంలో ఉండటం పై ఓటర్లకు అభినందనలు తెలిపారు. గ్రామాల్లో గొడవలు జరిగే పరిస్థితులుంటే ముందుగా తెలియజేయాలని సూచించారు. ఎన్నికల చరిత్రలో తొలిసారి అత్యధికంగా జిల్లాలో 26 వేల మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. పోలింగ్ రోజున 35 కేసులు నమోదయ్యాయన్నారు. నోటీసులు వస్తే బైండోవర్ కింద తహశీల్దార్‌కు లక్షరూపాయలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పెద్ద పెద్ద కత్తులు, సుత్తులు నివాసాల్లో ఉంటే కేసులు నమోదు చేస్తారన్నారు. ఏగ్రామంలో కూడా పెట్రోలు, డీజల్ నిల్వ ఉండరాదన్నారు. ఎవరైనా అలా నిల్వలు ఉంచితే వెంటనే డీఎస్పీ, సీఐ, ఎస్సైలకు తెలియజేయాలని సూచించారు. ఎన్నికల్లో గెలుపొందిన తరువాత విజయోత్సవ ర్యాలీలు చేయాలంటే ఆర్వో, కలెక్టర్ అనుమతులు తప్పనిసరి అని చెప్పారు. ఓడినవారి షాపుల వద్ద గొడవలు పడటం వంటి చర్యలు జరగకుండా ఉండాలంటే ర్యాలీలు రద్దు చేసుకోవాలని సూచించారు. వాట్సాప్, ఫేస్‌బుక్‌లలో మేము గెలిచిన తరువాత మీ అంతు చూస్తామని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. కొన్ని గ్రామాల్లో వాగ్వాదాలు, నెట్టుకోవడం, ఘర్షణలు జరిగాయని చెప్పారు. అలాంటి వివరాలు స్పెషల్ బ్రాంచ్ నుంచి తమకు వచ్చాయన్నారు. ప్రజలందరూ ప్రశాంతంగా ఎవరు గెలిచినా ప్రశాంత వాతావరణానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. డీఎస్పీ అశోక్‌వర్ధన్‌రెడ్డి, సీఐ లు సమీఉల్లా,సుబ్బారావు, ఎస్సైలు సుమన్, ఆంజనేయులు,సంపత్, రమణయ్య ఒంగోలు ఎస్పీ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.


గాల్లోకి కాల్పులు చేస్తున్న పోలీసులు


బుల్లెట్లు తగిలిన వారిని స్ట్రెచర్‌పై అంబులెన్స్‌లోకి తీసుకెళ్తున్న పోలీసులు


చెట్టు నుంచి తాటి గెలలు కోస్తూ..



వేసవిలో ఎండలు దంచికొడుతున్నాయి. రోహిణి కార్తె కూడా సమీపిస్తోంది. ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వేడిని తట్టుకుని శరీరం డీహైడ్రేట్ కాకుండా చూసుకోవాల్సిన అవసరం ఉంది. శీతల పానీయాలు ఎన్ని తాగినా దాహార్తి తీరదు.! అందుకే ముంజలు ఆరగించేయాలి. పుచ్చకాయ, కర్బూజలో నీటి శాతం, ప్రొటీన్లు ఉన్నప్పటికీ మానవ శరీరానికి ఎక్కువ మేలు చేసేవి తాటి ముంజలే. నోట్లో వేసుకోగానే కరిగిపోయే తాటి ముంజలతో బోలెడు లాభాలు ఉన్నాయి. ×ఐస్ యాపిల్స్₹గా పేరొందిన తాటి ముంజల్లో కాల్షియం, ఐరన్, పొటాషియం, మెగ్నీషియం, జింక్, ఫాస్పరస్‌తోపాటు ఫైటోన్యూట్రియెంట్లు, విటమిన్లు, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. నీటి శాతం అధికంగా ఉండే తాటి ముంజలను తినడం ద్వారా వేసవిలో శరీరం డీహైడ్రేట్ కాకుండా చూసుకోవచ్చు. గ్రామాల్లో విరివిగా దొరికే తాటి ముంజలకు సీటీల్లోనూ భారీగా గిరాకీ పెరిగింది.

ఐస్ యాపిల్

తింటే సల్లగుంటది!

- జిల్లాలో జోరుగా సాగుతున్న ముంజల వ్యాపారం
- పల్లెలతోపాటు పట్టణాల్లోనూ గిరాకీ
- జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు ముంజలు ఎగుమతి
- ముంజల సేకరణతో ఉపాధి పొందుతున్న వందలాది కుటుంబాలు
- వేసవి సీజన్‌లో నెలకు రూ.60 వేల వరకు ఆదాయం

కొనకనమిట్ల: తాటి ముంజల వ్యాపారం జిల్లాలో జోరుగా సాగుతోంది. వేసవి తాపాన్ని తగ్గిస్తూ, ఆరోగ్యాన్ని కాపాడటంలో ఉపకరిస్తున్న ముంజలు లొట్టలేసుకుంటూ ఆరగించే వారి సంఖ్య కూడా పెరిగిపోతోంది. చిన్నా పెద్దా తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో ముంజలు తినేందుకు ఆసక్తి చూపుతున్నారు. వేసవి కాలంలో మాత్రమే దొరికే తాటి ముంజల సేకరణలో ఎంతో శ్రమ ఉంటుంది. వందల కుటుంబాలు ముంజల సేకరణ, విక్రయం ద్వారా జీవనోపాధి పొందుతున్నాయి. ముంజలు సేకరించిన తర్వాత వినియోగదారులకు నేరుగా విక్రయించడంతోపాటు హోల్‌సెల్ వ్యాపారం కూడా చేస్తున్నారు.

ఉపయోగాలివే..

- తాటి ముంజలకు క్యాన్సర్ల నుంచి రక్షించే గుణం ఉందని వైద్యుల పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. ఇవి కొన్నిరకాల ట్యూమర్లు, బ్రెస్ట్ క్యాన్సర్, గ్యాస్ట్రిక్ క్యాన్సర్, లంగ్ క్యాన్సర్ కణాలను నిర్మూలిస్తాయని చెబుతున్నారు.
- లివర్, జీర్ణ సంబంధిత సమస్యలను తగ్గించడంతోపాటు గర్భిణుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఉపకరిస్తాయి.
- వేసవిలో శరీరం కోల్పోయే ఎలక్ట్రోలైట్స్‌ను సమతుల్యం చేసి తక్షణ శక్తిని ఇచ్చేందుకు ముంజలు దోహదపడతాయి.
- తాటి ముంజల్లో విటమిన్ ఏ అధిక శాతంలో ఉంటుంది.
- 100 గ్రాముల ముంజల్లో 43 కేలరీలు ఉంటాయి.
- బరువును అదుపులో ఉంచడంలో, ముఖంపై మొటిమలు తగ్గించడంలో మేలు చేస్తాయి.

జోరుగా వ్యాపారం

కొనకనమిట్ల మండలంలోని గొట్లగట్టు, బ్రాహ్మణపల్లి, నాయుడుపేట, చినమనగుండం, వింజవర్తిపాడు, దాసరపల్లి, సలనూతల, మర్రిపాలెం తదితర గ్రామాలతోపాటు హనుమంతునిపాడు, కొత్తపట్నం, జె.పంగులూరు మండలాల్లో కూడా విస్తారంగా తాటి తోపులు ఉన్నాయి. వందలాది కుటుంబాలు తెల్లవారుజామునే పొలాలకు వెళ్లి తాటికాయలు సేకరించి, ముంజలు విక్రయించి ఉపాధి పొందుతున్నారు. బ్రాహ్మణపల్లి గ్రామంలో ప్రతి కుటుంబం తాటి ముంజలు సేకరించి విక్రయిస్తుండటం విశేషం. ఈ గ్రామంలో పదేళ్ల పిల్లలు కూడా అవలీలగా తాటి చెట్లు ఎక్కి కాయలు దించడంలో హుషారుగా ఉంటారు. మూడు నెలలుపాటు జరిగే వ్యాపారంలో ఒక్కో కుటుంబం రూ.60 వేల వరకు సంపాదిస్తోంది. అంతేగాకుండా కర్నూలు, నంద్యాల, మార్కాపురం, ఒంగోలు, పోరుమామిళ్ల, కొమరోలు, ఆత్మకూరు, గిద్దలూరు, దొనకొండ ప్రాంతాలకు చెందిన కొందరు ఇక్కడ హోల్‌సెల్‌గా ముంజలు కొనుగోలు చేసి తమ ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు.


గొట్లగట్టు బస్టాండ్‌లో ముంజల వ్యాపారం


పొలాల్లో సేకరించిన ముంజలను తరలిస్తూ..

కష్టంతో కూడుకున్న పని



తాటి ముంజల సేకరణ చాలా కష్టంతో కూడుకున్న పని. అయితే మాకు అలవాటైన పని కావడం, తగిన జాగ్రత్తలు తీసుకుంటుండటంతో ఇబ్బంది లేకుండా ముందుకు సాగుతున్నాం. వేసవి కాలంలో ముంజల సేకరణతో చేతి నిండా పని దొరుకుతోంది. – పి.సుబ్బయ్య, బ్రాహ్మణపల్లి

ముంజలు ఆరోగ్యానికి మేలు



సీజనల్‌గా లభించే తాటి ముంజలు తినడం ఆరోగ్యానికి మంచిది. తాటి పండులో ఎన్నో రకాల పోషకాలు ఉంటాయి. వేసవిలో శరీరానికి కలిగే అలసత్వాన్ని ముంజలు తగ్గిస్తాయి. ఇందులో ఉండే విటమిన్లు జింక్ ఫాస్ఫరస్, ఖనిజ లవనాలు శరీరంలో రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తాయి. తాటి ముంజల పైన ఉండే తొక్క తీయకుండా తింటే శరీరానికి చాలా మంచిది. – డాక్టర్ ఎస్పీ.బాలయ్య, కొనకనమిట్ల


తాటి కాయల నుంచి ముంజలు తీస్తూ..

హర హరా.. చెన్నకేశవా..

- హెచ్‌ఎంపాడు మండలం చిన్నగొల్లపల్లిలో భక్తిపారవశ్యం
- శ్రీలక్ష్మీ చెన్నకేశ్వ స్వామి తిరునాళ్లలో భాగంగా వైభవంగా గరుడ సేవ
- పాలెగాళ్ల ఖడ్గ సేవ, పోతురాజు గావును ఆసక్తిగా తిలకించిన భక్తులు


చెన్నకేశవ స్వామి ఖడ్గ సేవ ఉత్సవం

హనుమంతునిపాడు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన చిన్నగొల్లపల్లి శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి తిరునాళ్ల అంగరంగ వైభవంగా సాగుతోంది. నాగులేటి ఒడ్డున కొలువై ఉన్న శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ వార్షిక తిరునాళ్లలో భాగంగా మంగళవారం గరుడ సేవ, పొంగళ్ల సమర్పణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. జిల్లా దేవదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఆచార సంప్రదాయాల ప్రకారం స్వామి వారికి అర్చకులు, పాలెగాళ్ల దండకాలు చదివి ప్రత్యేక పూజలు చేశారు. కొన తాళ్లను పూజించి పోతురాజుకు పట్టాలు వేసిన అనంతరం మేకపోతు గావు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని భక్తులు ఆసక్తిగా తిలకించారు. చెక్కా వంశస్తులు పొంగలి బోనాలతో, గోవింద నామాన్ని ఉచ్చరిస్తూ పోతురాజుల వీర కేకల నడుమ ఖడ్గ సేవలో పాల్గొన్నారు. నీలకంఠాపురం, రంగంపేట పాలెగాళ్లు భక్తి శ్రద్ధలతో ఖడ్గ సేవ చేశారు. స్వామివారికి పూజలు నిర్వహించి అంకాలమ్మ తల్లి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని గుంటూరు, మార్కాపురం, చీరాల, కావలి, నెల్లూరు, హైదరాబాద్‌లో స్థిరపడిన చెక్కా కుటుంబీకులు, అలాగే మధ్యప్రదేశ్, న్యూఢిల్లీ, ఛత్తీస్‌ఘడ్, తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర ప్రాంతాల్లో స్థిరపడిన కనిగిరి ప్రాంత భక్తులు భారీ సంఖ్యలో తిరునాళ్లకు హాజరయ్యారు. తమ ఇష్ట దైవం చెన్నకేశవస్వామికి పొంగళ్లు సమర్పించి మొక్కులు చెల్లించారు. తిరునాళ్లలో బుధవారం మోహినీ ఉత్సవం, ఖడ్గ సేవ, మేకపోతు గావుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, గురువారం సాయంత్రం కంపకల్లి నిర్వహించనున్నారు.


పొంగళ్లు పెడుతున్న భక్తులు


గరుడ సేవలో భక్తులు

ముగిసిన చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు


చెన్నకేశవస్వామి

కొనకనమిట్ల: 12 రోజులుగా మండలంలోని పెదారికట్లలో నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి, పార్వతి సమేత రాజనగరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత భక్తి శ్రద్ధలతో మంగళవారం ముగిశాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా చెన్నకేశవస్వామికి ఏకాంతసేవ కార్యక్రమం భక్తుల జయజయ ధ్వానాలతో వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య మంగళ వాయిద్యాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన వాహనంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి విగ్రహాలను ఉంచి గ్రామంలో ఉత్సవం నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమానికి ఉభయ దాతలుగా చిన్నమద్దూరి, రాజాల, బొల్లావుల, వరికూటి కుటుంబాలకు చెందిన దంపతులు వ్యవహరించారు. వేదపండితులు నంద్యాల వెంకటకృష్ణకిరణ్, నుదురుపాటి వెంకట కృష్ణారావు స్వామివారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. 12 రోజులుగా బంధుమిత్రుల రాకతో గ్రామంలో సందడి నెలకొంది. వైభవంగా బ్రహ్మోత్సవాలను జయప్రదంగా చేసిన గ్రామస్తులకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.


అలంకరణలో అమ్మవారు


ఏకాంతసేవలో భక్తులు

పశ్చిమ ప్రకాశంలో

లా అండ్ ఆర్డర్‌పై ప్రత్యేక దృష్టి

- కౌంటింగ్ అనంతరం గొడవలకు పాల్పడితే రౌడీషీట్ ఓపెన్
- ఇప్పటికే 7 వేల మందిపై బైండోవర్ కేసులు
- గ్రామాల్లో పోలీసు అధికారుల పల్లెనిద్ర
- డీఎస్పీ బాలసుందరరావు వెల్లడి



మాట్లాడుతున్న డీఎస్పీ బాలసుందరరావు, పక్కన సీఐ వెంకటేశ్వర్లు

మార్కాపురం: పశ్చిమ ప్రకాశంలో లా అండ్ ఆర్డర్‌పై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు డీఎస్పీ బాలసుందరరావు తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో సీఐ ఆవుల వెంకటేశ్వర్లుతో కలసి ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కొమరోలు, యర్రగొండపాలెం ప్రాంతాల్లో చిన్న సంఘటనలు మినహా ఎక్కడా గొడవలు జరగలేదని, అందరూ సహకరించారని అన్నారు. కౌంటింగ్ అనంతరం ఊరేగింపులు, ర్యాలీలు టపాసులు కాల్చడం లాంటి కార్యక్రమాలకు అనుమతిలేదన్నారు. గతంలో జరిగిన ఎన్నికల్లో గొడవలకు పాల్పడిన వారిపై ప్రత్యేక నిఘాపెట్టామన్నారు. డివిజన్‌లోని మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల్లో మొత్తం 7 వేల మందిపై బైండోవర్ కేసులు పెట్టామన్నారు. వచ్చేనెల 6 వరకూ ర్యాలీలకు అనుమతి లేదని చెప్పారు. గొడవలు, అల్లర్లకు పాల్పడితే కేసులు నమోదుచేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. ప్రతి పోలీసు అధికారి గ్రామాలకు వెళ్లి పల్లెనిద్ర చేయాలని ఎస్పీ ఆదేశించినట్లు తెలిపారు. కార్డన్ సెర్చ్ కార్యక్రమం కౌంటింగ్ వరకూ కొనసాగుతుందన్నారు. పేలుడు పదార్థాలు, అనుమానిత వ్యక్తులు, అనుమతి పత్రాలు లేని వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ఇప్పటి వరకూ సుమారు 2 వేల వాహనాల వరకూ సీజ్ చేసినట్లు తెలిపారు. కత్తులు, బాంబులు, ఇతర మారణాయుధాలు ఉంటే ఆర్మ్స్ యాక్ట్ పెడతామని చెప్పారు. క్రాకర్స్ అమ్మేవారు కూడా బల్క్‌గా అమ్మవద్దని హెచ్చరించినట్లు తెలిపారు. డీజేలకు పర్మిషన్ లేదన్నారు.

సోషల్‌మీడియాపై నిఘా: తాము ఏర్పాటు చేసుకున్న వాట్సప్ గ్రూపుల ద్వారా వదంతులు, చట్టవ్యతిరేక మెసేజులు, ఉద్రేకాలు, గొడవలు సృష్టించేలా ఉండే గ్రూపులపై నిఘా పెట్టామని, అలాంటివారిపై కూడా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ప్రజలు ఉండాలని పోలీసులకు సహకరించాలని కోరారు. ఆయన వెంట పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ ఉన్నారు.

మహిళా ఉద్యోగికి లైంగిక వేధింపులు

- ఒంగోలులో విచారణ

మార్కాపురం: మార్కాపురం డివిజన్ పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న ఒక మహిళా ఉద్యోగిని అదే కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగి లైంగిక వేధింపులకు పాల్పడటంతో ఆమె ఒంగోలులోని జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. దీంతో మంగళవారం ఒంగోలుకు పిలిపించి సదరు మహిళను వేధిస్తున్న ఉద్యోగిని జిల్లా అధికారి విచారణ చేసినట్లు సమాచారం. ఐదు నెలలుగా ఆ ఉద్యోగి మహిళను వేధింపులు గురిచేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఈయన గతంలో ఒంగోలులో కూడా ఉద్యోగం చేసేటప్పుడు మహిళా ఉద్యోగులను వేధించడంతో అక్కడి సిబ్బంది పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఆయనను ఒంగోలు నుంచి మార్కాపురానికి బదిలీ చేసినా తీరు మారకపోవడంపై ఆ మహిళా ఉద్యోగి తోపాటు మిగిలిన ఉద్యోగులు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

గాలి దుమారం.. జర అప్రమత్తం!


ఒంగోలు, వెల్లంపల్లి రోడ్‌లో మబ్బులు పట్టిన ఆకాశం

ఒంగోలు సెంట్రల్: భీకర గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వీలైనంత వరకు బయటకు రాకపోవటం మంచిదని వాతావరణ నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వ్యవసాయ పనులకు వెళ్లే కూలీలు, రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు. వర్షం కురిసే సమయంలో పిడుగులు పడే అవకాశం ఉందని, చెట్ల కింద తల దాచుకోవడం ప్రమాదమని హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో అకాల వర్షాలు కురుస్తున్నందున ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు.

గాలివాన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవే..

చిన్నపాటి వర్షం కురవడం ప్రారంభమైనప్పుడే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి. ఉరుములు మెరుపులు వస్తున్న సమయంలో ఎత్తయిన ప్రదేశాలు, చెట్లు కింద ఉండకూడదు. పిడుగులు పడే సమయంలో ల్యాండ్ లైన్ ఫోన్‌లో మాట్లాడకూడదు. ఇంట్లోని స్విచ్ బోర్డుల నుంచి ప్లగ్‌లు తీసివేయాలి. టీవీలు చూడకపోవటం మంచిది. విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలో ఉండకూడదు. ఉరుములు, మెరుపుల సమయంలో మన శరీరం జలదరింపునకు గురవ్వడం లాంటి సంకేతాలు వస్తే సమీపంలో పిడుగు పడబోతున్నట్లు గుర్తించాలి.